బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 07 ఫిబ్రవరి 2026 www.balagamtv.com పేజీలు 4




## అండర్-19 ప్రపంచకప్ విజేత భారత్

### ఇంగ్లండ్‌పై 100 పరుగుల ఘన విజయం

### ఆరో టైటిల్‌తో చరిత్ర

వివరాలు 4వ పేజీలో

# కాళేశ్వరం

# అవినీతిని కాపాడుతున్నది బీజేపీనే




- కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రక్షిస్తున్నారు
- బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే మూసీలో వేసినట్టే..
- నిజామాబాద్‌కు బీజేపీ ఏమి తెచ్చింది?
- నాకు కులం, మతం లేదు.. అందరివాడిని
- సీఎం రేవంత్ రెడ్డి
- నిజామాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**బలగం టీవి, నిజామాబాద్**

రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని బీజేపీ నేతలే చెప్పారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తే కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేస్తారనే భయం బీజేపీకి ఉందని విమర్శించారు. అందుకే ఇంతవరకు కాళేశ్వరం కేసుకు అటు దిక్కు ఇటు గతి లేదని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు.నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "అసలు కిషన్‌రెడ్డి ఎందుకు కాపాడుతున్నారు? ఇప్పుడు ఆయన కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారు" అంటూ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయో, బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయో ప్రజలే తేల్చాలని వ్యాఖ్యానించారు.

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం**

ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా తెలంగాణకు గొప్ప నాయకులను అందించిందని, ఈ ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పు ఇవ్వాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఇందూరుకు చేసిందేమీ లేదని అన్నారు.

**నిజామాబాద్ వ్యవసాయం దేశానికే ఆదర్శం**

నిజామాబాద్ పసుపు బంగారంతో పోటీ పడే స్థాయిలో అభివృద్ధి చెందిందని సీఎం గుర్తు చేశారు. ఇక్కడి వ్యవసాయం తెలంగాణకే కాదు దేశానికే ఆదర్శమని కొనియాడారు. నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికి మార్గదర్శకమని ప్రశంసించారు. 2028 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల పూర్తి కోసం, అదనపు నిధుల మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సూచనలతో జిల్లాలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం తెలిపారు. నిధులు విడుదల చేయాలనుకున్నా, 90 శాతం మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ సభ్యులే ఉన్నారని అన్నారు. నిధులు ఇచ్చినా అభివృద్ధి చేస్తారనే నమ్మకం లేదని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే వేగంగా అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు.

**నిజామాబాద్‌కు బీజేపీ ఏమి తెచ్చింది?**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు కేంద్రంలో ఎలాంటి పరపతి లేదని సీఎం ఆరోపించారు. నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదని ప్రశ్నించారు. కేంద్రం నుంచి తెలంగాణకు, ముఖ్యంగా నిజామాబాద్‌కు బీజేపీ నేతలు ఏ నిధులు తెచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు.

**అన్ని వర్గాల వాడిని నేనే**

తనకు కులం, మతం లేదని, తాను అందరి వాడినని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని కులాలు, మతాలను సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని విమర్శించే బీఆర్ఎస్ నేతలకు సమాధానంగా లక్షలాది మందికి రేషన్ కార్డులు, 3.17 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో కొత్త రికార్డులు నెలకొల్పామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. దేశంలోనే తొలిసారి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించడం కాంగ్రెస్ ఘనత అని తెలిపారు. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఖరీఫ్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని వెల్లడించారు.

**నిజామాబాద్ జిల్లాకు రూ.600 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.600 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. వీటితో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ సభలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్‌తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్

## ఏడుగురు మావోయిస్టులు మృతి... ఇద్దరు జవాన్లు వీరమరణం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో భద్రతా బలగాలు--మావోయిస్టుల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందగా, ఇద్దరు జవాన్లు వీరమరణం పొందారు. గడ్చిరోలి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు, స్థానిక పోలీసుల సహకారంతో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలను గమనించిన మావోయిస్టులు అకస్మాత్తుగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో మూడు ఏకే--47 తుపాకీలు సహా పలు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ ఇన్‌చార్జ్ ప్రభాకర్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడిపై రూ.25 లక్షల రివార్డు ఉందని పేర్కొన్నారు. ప్రభాకర్ స్వస్థలం తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా అని అధికారులు తెలిపారు. మరోవైపు, ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా మావోయిస్టు కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే వేలాది మంది మావోయిస్టులు ప్రభుత్వానికి లొంగిపోగా, వందలాది మంది ఎదురు కాల్పుల్లో మరణించారు. కేంద్రం తీసుకుంటున్న చర్యలు మావోయిస్టుల నిర్మూలనలో సత్ఫలితాలు ఇస్తున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి.

# పార్లమెంట్‌లో కొనసాగిన గందరగోళం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్‌లో లోక్‌సభలో గందరగోళం శుక్రవారం కూడా కొనసాగింది. గురువారం రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై లోక్‌సభలో తమ నాయకుడికి మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని విపక్షాలు ప్రశ్నించాయి.

ఈ సందర్భంగా పలువురు విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. సభను సజావుగా నడిపేందుకు స్పీకర్ పలుమార్లు సభ్యులను శాంతింపజేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో లోక్‌సభను సోమవారం వరకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో ఇప్పటికే 19 గంటల 13 నిమిషాల సమయం వృథా అయ్యిందని స్పీకర్ తెలిపారు. సభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్ తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13వ తేదీతో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 9 నుంచి లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ జరగనుంది.

# తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు 3 వారాల గడువు



- ఆలోగా విచారణ పూర్తి చేయకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవని హెచ్చరిక

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు స్పష్టమైన గడువు విధించింది. ఈ పిటిషన్ల విచారణను పూర్తి చేయడానికి మరో మూడు వారాల సమయం ఇస్తూ కేసు విచారణను వాయిదా వేసింది. గడువులోగా విచారణ ప్రక్రియను పూర్తిచేస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. మూడు వారాల తర్వాత మళ్లీ విచారణ చేపడతామని, అప్పటివరకు కోర్టు ఆదేశాలు అమలు కాకపోతే ధిక్కరణ చర్యలపై ఆలోచిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.శుక్రవారం సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బీజేపీ శాసనసభా నేత మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ తరపు న్యాయవాది మోహిత్‌రావు కోరారు. ఇప్పటికే స్పీకర్‌కు మూడు సార్లు గడువు ఇచ్చినప్పటికీ కోర్టు ఆదేశాలు అమలు కాలేదని, మరోసారి గడువు పెంచడం సరికాదని మోహిత్‌రావు వాదించారు.10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలలో 8 మంది అనర్హత పిటిషన్ల విచారణ మాత్రమే పూర్తయిందని, దానం నాగేందర్, కడియం శ్రీహరి సంబంధిత పిటిషన్లపై అవసరమైన సాక్ష్యాలు సమర్పించినప్పటికీ విచారణ పూర్తి చేయడంలో స్పీకర్ ఆలస్యం చేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

అయితే, స్పీకర్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఇప్పటివరకు జరిగిన విచారణ పురోగతిని ధర్మాసనానికి వివరించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తి చేయడానికి మరో మూడు వారాల గడువు ఇవ్వాలని కోరారు.స్పీకర్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం మరో మూడు వారాల గడువు ఇస్తూ కేసు విచారణను వాయిదా వేసింది. గడువులోగా విచారణ పూర్తి చేయకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవని స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది.



## కొనసాగుతున్న మేడారం జాతర హుండీల లెక్కింపు

- ఇప్పటివరకు ఆదాయం రూ.6కోట్లు
- కార్యనిర్వహణాధికారి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర హుండీల ఆదాయ లెక్కింపు హన్మకొండ జిల్లాలోని టీటీడీ కళ్యాణ మండపంలో కొనసాగుతోంది. కానుకలను దేవాదాయ శాఖ అధికారులు, స్వచ్ఛంద సేవకుల పర్యవేక్షణలో లెక్కిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు జరిగిన లెక్కింపు వివరాలను కార్యనిర్వహణా ధికారి వెల్లడించారు. శుక్రవారం 160 హుండీలను తెరిచి లెక్కించగా రూ.3,54,88,636 తేలింది. రెండ్రో జులు కలిపి మొత్తం 285 హుండీలను లెక్కించగా.. ఇప్పటివరకు రూ.6,04,53,636 వచ్చినట్టు అధికారులు తెలిపారు. నగదుతో పాటు ఫిబ్రవరి 5న విదేశీ కరెన్సీ ద్వారా రూ.63,436 వచ్చిందన్నారు. అలాగే, బంగారం, వెండి కానుకలను పర్యవేక్షణ అధికారుల సమక్షంలో ప్రత్యేకంగా ఇనుప హుండీలలో భద్రపరిచారు. వీటిని తదుపరి విడతలో తూకం వేసి లెక్కించనున్నారు. ప్రస్తుతానికి నోట్ల లెక్కింపు మాత్రమే జరుగుతోందని, నాణేల లెక్కింపు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు తెలిపారు. మరోవైపు, దేవాదాయశాఖ సిబ్బంది, సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఈ లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శ కంగా, ప్రశాంతంగా సాగుతోంది. సేకరించిన నగదు ను ఎప్పటికప్పుడూ బ్యాంకు అధికారులకు అప్పగిస్తున్నారు. ఈ లెక్కింపు నివేదికను దేవాదాయ శాఖ కమిషనర్‌తోపాటు ములుగు జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.

# కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు చేసిందేమీ లేదు..



- రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడకండి..సమస్యలపైనే సమరం
- కాంగ్రెస్ వైఫల్యాలను, హామీల అమలు మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి..
- కుల మతాల పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, వేములవాడ:**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాల పైన విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దొంగ మాటలతో అధికారంలోకి వచ్చి అడ్డగోలు హామీలు చెప్పి పదవి ఎక్కిన తర్వాత ప్రజల్ని మోసం చేస్తున్నదన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం వేములవాడ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేవలం తన వైఫల్యాలను హామీల అమలును కప్పిపుచ్చుకోవడానికి కీలకమైన మున్సిపల్ ఎన్నికల వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్ల దండకం అందుకున్నారని, రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్ లో పడవద్దని తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా భారత రాష్ట్ర సమితి కార్యకర్తలకు పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ గడ్డపై ప్రస్తుతం ఒక వికృతమైన రాజకీయ క్రీడ నడుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి, మన స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడు కేసీఆర్ అని, ఒక తండ్రిలా ఈ రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, పడావు పడ్డ తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి ఆయనేనని కొనియాడారు. కేసీఆర్ ఎప్పుడూ బిరుదుల కోసం, సన్మానాల కోసం పాకులాడలేదని, తెలంగాణ ప్రజల శ్రేయస్సు మరియు సంక్షేమమే ఆయనకు నిజమైన సత్కారమని కేటీఆర్ స్పష్టం చేశారు. నేడు అధికార గర్వంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ వ్యక్తిత్వం మీద విషం చిమ్ముతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తి మీద జరుగుతున్న దాడి కాదని, తెలంగాణ ఉద్యమ చరిత్ర మీద జరుగుతున్న దాడి అని ఆయన అభివర్ణించారు.

రేవంత్ రెడ్డి పన్నుతున్న 'తిట్ల ట్రాప్'లో పార్టీ శ్రేణులు ఎవరూ పడకూడదని ఆయన హెచ్చరించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది.. వార్డుల్లోని మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ మరియు ఇంటింటికీ అందాల్సిన పథకాల మీదనే కానీ, రేవంత్ రెడ్డి తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల కన్నీటిని తుడిచే దిశగా మన పోరాటం సాగాలని, అబద్ధపు ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎరువుల కోసం క్యూ లైన్లలో రైతులు పడుతున్న పాట్లు, రైతు భరోసా అందక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కోరల్లో చిక్కుకున్న అన్నదాతల కష్టాల గురించి గొంతెత్తాలని సూచించారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక చదువులు ఆగిపోతున్న బిడ్డల వేదనకు, గురుకులాల్లో విషాహారం తిని అల్లాడి పోతున్న పసి ప్రాణాలకు రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని, ఆయనను గల్లా పట్టి అడగాలని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, డీఏలు మరియు పీఆర్సీ లేక నలిగిపోతున్న ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన నిలబడాలని కేటీఆర్ కోరారు. సింగరేణి బొగ్గు స్కామ్, విద్యుత్ కుంభకోణాల వెనుక ఉన్న అసలు దొంగలెవరో ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని, మన నీటి వాటాను పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తున్న రేవంత్ రెడ్డి 'కోవర్టు' ద్రోహాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల తీర్పే కేసీఆర్ కి ఇచ్చే అసలైన గౌరవమని, పదేళ్ల ఉజ్వల ప్రగతి తర్వాత ఈ రెండేళ్లలో తెలంగాణ అనుభవిస్తున్న ఈ దుర్గతికి కారణాలను ప్రజల ముందుకు బలంగా తీసుకెళ్లాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఒక ధ్రువతార అని, ఆయన కీర్తి నిరంతరం వెలుగులీనుతూనే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇది ఒక గ్రహణ కాలమని, రేవంత్ అనే రాహువు నుండి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి బిడ్డపై ఉందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నలను పిడుగుల్లా కురిపించాలని, మిగితా 4వ పేజీలో

## 9 నుంచి జర్నలిస్టుల అక్రెడిటేషన్స్‌కు దరఖాస్తులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ''తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్ -- 2025''ను అధికారికంగా విడుదల చేసింది. ఈ మేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ డ పీఆర్) జీవో నెం.252ను జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.అర్హత కలిగిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు ఫిబ్రవరి 9 నుంచి సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

# ప్రపంచ స్థాయి మహానగరంగా హైదరాబాద్ అభివృద్ధి

- నగరాభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయింపు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి మహానగరంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ దిశగా గత రెండు సంవత్సరాల్లోనే నగరాభివృద్ధికి రికార్డు స్థాయిలో రూ.20 వేల కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ మొత్తంలో నిధులు నగరాభివృద్ధికి కేటాయించడం ఇదే తొలిసారిగా పేర్కొన్నారు.హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం ద్వారా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో సమగ్ర ప్రణాళికతో కూడిన సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం తెలిపారు. నగర విస్తరణను నియంత్రితంగా చేపట్టి మౌలిక వసతులు మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**హెచ్--సిటి ద్వారా వేగవంతమైన మౌలిక వసతులు**

హెచ్--సిటి ప్రోగ్రాం ద్వారా రూ.7,032 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు నగరవాసులకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడమే ఈ ప్రణాళిక ఉద్దేశమని చెప్పారు.

తెలంగాణ రైజింగ్ విజన్--2047లో భాగంగా కేవలం మౌలిక వసతుల అభివృద్ధికే కాకుండా పర్యావరణ పరిరక్షణ, మెరుగైన జీవన ప్రమాణాలకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పచ్చదనం, శుభ్రమైన గాలి, సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా విధానాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా, అత్యంత నివసించదగిన నగరంగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. అలాగే రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపారు.

# తెలంగాణకు కేంద్రం నుంచి రూ.12 లక్షల కోట్ల సాయం

- నిధుల కొరత కాదు.. భూ సేకరణలో అవినీతే అభివృద్ధికి అడ్డంకి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గత 12 ఏళ్లలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల మేర సహకారం అందించిందని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఇందులో పన్నుల వాటా (ట్యాక్స్ షేరింగ్), మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చేసిన ఖర్చు కూడా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి నిధుల కొరత లేదని, భూ సేకరణలో జరుగుతున్న అవినీతే అనేక ప్రాజెక్టులు ఆలస్యమవడానికి కారణమని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ,"కేంద్రం నిధులు ఇస్తోంది. కానీ ఇక్కడ భూ సేకరణలో అవినీతి జరుగుతోంది. దాని వల్లే పనులు ఆలస్యం అవుతున్నాయి" అని అన్నారు. భూమికి సంబంధించిన సమస్యలు పరిష్కారమైతే, భూ సేకరణకు సంబంధించిన నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు.తెలంగాణలో ఇప్పటికే 5,000 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయ్యిందని, భవిష్యత్తులో కూడా ఈ పనులు కొనసాగుతాయని కేంద్ర మంత్రి తెలిపారు.

**పన్నుల వాటాలో రూ.33,180 కోట్లు**

ఈ ఆర్థిక సంవత్సరంలోనూ తెలంగాణకు పన్నుల వాటా కింద రూ.33,180 కోట్లు లభిస్తాయని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో రాష్ట్రానికి పన్నుల రూపంలో మొత్తం రూ.2.52 లక్షల కోట్ల నిధులు బదిలీ అయ్యాయని వివరించారు. ఈ సందర్భంగా యూపీఏ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, "యూపీఏ పాలనలో తెలంగాణకు పన్నుల రూపంలో వచ్చిన మొత్తం రూ.60 వేల కోట్లకు కూడా చేరలేదు" అని వ్యాఖ్యానించారు.

**స్థానిక సంస్థలకు భారీ నిధులు**

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించనున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. 2026-27 నుంచి 2031-32 వరకు తెలంగాణ గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.9,968 కోట్లు (రూరల్ లోకల్ బాడీ గ్రాంట్స్) అందుతాయని తెలిపారు. అలాగే పట్టణ స్థానిక సంస్థలకు రూ.11,548 కోట్ల నిధులు మంజూరు కానున్నాయని, వీటితో పట్టణ మౌలిక వసతులు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు.

తెలంగాణ రాజకీయాల్లో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిధుల బదిలీపై తరచుగా వాగ్వాదం జరుగుతున్న నేపథ్యంలో, ప్రహ్లాద్ జోషి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కేంద్రం నిధులు ఇస్తోందని, వాటి వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపైనే సందేహాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.



## 'వికసిత తెలంగాణ- బీజేపీ సంకల్ప పత్రం' ఆవిష్కరణ

- అవినీతి రహిత పాలన, కేంద్ర నిధుల పూర్తి వినియోగమే లక్ష్యం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాబోయే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు 'వికసిత తెలంగాణ -- బీజేపీ సంకల్ప పత్రం'ను శుక్రవారం పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. అవినీతి రహిత పాలన, కేంద్రం నుంచి గరిష్ఠంగా నిధుల సమీకరణ, ప్రత్యక్ష లబ్ధి బదిలీ వ్యవస్థ ద్వారా ప్రజా సంక్షేమానికి నిధుల పారదర్శక వినియోగమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ లేదా మున్సిపల్ ఆస్తులపై అక్రమ ఆక్రమణలు, నిధుల మళ్లింపు, అధికారుల లేదా పార్టీ సభ్యుల నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రతి మున్సిపాలిటీలో నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని సంకల్ప పత్రంలో పేర్కొన్నారు. ప్రతి మున్సిపాలిటిని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ప్రతి పట్టణంలో వాకింగ్ ట్రాకులు, సీనియర్ సిటిజన్లు--యువత కోసం ఆధునిక పార్కులు, అప్‌గ్రేడ్ చేసిన యుటిలిటీ పార్కులు, ఎల్ఈడీ వీధిదీపాలు, సమగ్ర చెత్త నిర్వహణ, స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో మిగితా 4వ పేజీలో

# మొబైల్ రికవరీలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు జాతీయ కీర్తి..



- సాంకేతికతతో గుర్తింపు... సేవతో పరిష్కారం..
- CEIR తో విశిష్ట విజయం సాధించిన జిల్లా పోలీసులు.
- 78% మొబైల్ రికవరీ రేటుతో దక్షిణాది రాష్ట్రాలలో మొదటి స్థానం.
- జిల్లా పోలీసుల పనితీరును ప్రశంసించిన రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్ రికవరీలో దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించి విశిష్ట ఘనతను తమ ఖాతాలో వేసుకున్నారు. CEIR వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ 78 శాతం మొబైల్ రికవరీ రేటు సాధించి, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా పోలీస్ యంత్రాంగం గర్వకారణమైన విజయం సాధించారు.జిల్లాలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ట్రాకింగ్ విధానాలు, జజుక్ష్మీక్ష్మ అప్లికేషన్‌ను సమర్థంగా ఉపయోగించడం ద్వారా ఇప్పటివరకు మొత్తం 2,286 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేస్తూ 78 శాతం రికవరీ రేటు సాధించడం విశేషం. ఈ అద్భుతమైన పనితీరుతో దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానాన్ని సాధించింది.

ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్. జిల్లా పోలీస్ అధికారులను అభినందిస్తూ ప్రశంసలు కురిపించి, హర్షం వ్యక్తం చేశారు. మొబైల్ రికవరీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ , న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్‌లో మొదటి స్థానం జిల్లా పోలీసులకు దక్కడం గర్వకారణం అని పేర్కొన్నారు.ఈ నెల 12వ తేదీన కేరళ లోని ఎర్నాకులంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సుకు జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే హాజరై, జజుక్ష్మీక్ష్మ ద్వారా మొబైల్ ఫోన్ రికవరీలో అనుసరించిన ఉత్తమ విధానాలు, కార్యాచరణ వ్యూహాలు, విజయవంతమైన అనుభవాలను కాన్ఫరెన్స్‌లో వివరించి అవార్డును స్వీకరించనున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ రికవరీలో ఆల్ ఇండియా స్థాయిలో గుర్తింపు రావడం, దక్షిణాది రాష్ట్రాలలో మొదటి స్థానం సాధించడం తెలంగాణ పోలీసుల పనితీరు, నిబద్ధతకు నిదర్శనం అని పేర్కొన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే బాధ్యతాయుతంగా, తక్షణ స్పందనతో వ్యవహరించడం, జజుక్ష్మీక్ష్మ వంటి ఆధునిక డిజిటల్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించడం, సాంకేతిక నైపుణ్యంతో ట్రాకింగ్ నిర్వహించడం వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా తక్షణమే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు CEIR పోర్టల్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

మొబైల్ ఫోన్ రికవరీలో విశేష ప్రతిభ కనబర్చిన ఐటీ కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ తిరుమలేష్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన, పారదర్శకమైన పోలీస్ సేవలను అందించడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తూ, ప్రజల నమ్మకాన్ని బలపరచే విధంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని ఎస్పీ తెలిపారు.

## సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబద్ ఎస్.ఐ గణేష్ తెలిపారు. వివరాల మేరకు... ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన బాధవత్ యమునా అనే మహిళ అనారోగ్యంతో ముస్తాబాద్‌లోని ఒక పీపుల్స్ దవాఖానలో చికిత్స పొందుతూ ఉండగా 11 సెప్టెంబర్ 2025 రాత్రి సుమారు 1 గంట సమయంలో హాస్పిటల్‌లో చొరబడి మహిళకు చెందిన సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు.బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ ఎస్‌ఐ గణేష్ కేసు నమోదు చేసి, నిందితుడు అయిన ముస్తాబద్ కి చెందిన మీస విష్ణును ఖస్త్రవ 24ఎ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా కోర్టులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష,2000/- రూపాయల జరిమాన విధించినట్లు ముస్తాబద్ ఎస్.ఐ గణేష్ తెలిపారు.

# సిరిసిల్ల పట్టణ కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్..

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలి..
- ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి, ఉల్లం ఘించిన వారిపై చర్యలు తప్పవు..
- మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్త్ ఏర్పాటు
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు శుక్రవారం రోజు సిరిసిల్ల పట్టణ కేంద్రంలో జిల్లా పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం స్వేచ్ఛాయుతగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పక పాటించాలని, ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిరిసిల్ల,వేములవాడ మున్సి పల్ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘ టనలు తలెత్తకుండా పటిష్ట పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందని,ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విధంగా అక్రమ మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణా చేస్తే పోలీస్ వారికి సమాచారం అందిం చాలన్నారు.ఫ్లాగ్ మార్చ్ లో సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్ లు కృష్ణ, శ్రీనివాస్, ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ లు శ్రీకాంత్, ఉపేంద్రచారి,రాజు,దిలీప్, రాహుల్ రెడ్డి, లక్ష్మణ్, వీనితా రెడ్డి, జునైద్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## భక్తులకు సాఫీగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలి..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు సాఫీగా దర్శనం కల్పించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం వేములవాడ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, వీఐపీ దర్శనాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ద్వారం, బారికేడింగ్ మరియు క్యూ లైన్లను సమీక్షించారు. భక్తులకు తాగునీటి సదుపాయం పెంచి ఎక్కువ పాయింట్లలో అందుబాటులో ఉంచాలని సూచించారు.అలాగే, నూతన బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ వద్ద ఖాళీ స్థలంలో స్వామివారి ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయాలని, మొబైల్ టాయిలెట్ల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. కళ్యాణకట్టను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు.జాతరను వైభవంగా నిర్వహించడానికి పూల అలంకరణతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేయాలని, పార్కింగ్, కోడెల్ టికెట్ కౌంటర్లు, పందిర్లు, శివార్చన స్టేజీ పరిశీలనలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం ఘనంగా నిర్వహించబడాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ రాధాభాయి, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఇల్లంతకుంట లో ఈ పంచాయతీ ఆపరేటర్ల తాత్కాలిక విధుల బహిష్కరణ..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలో ఈ పంచాయతీ మండల,గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు గత నాలుగు నెలలుగా జీతాలు రానందున తాత్కాలికంగా విధులను బహిస్కరిస్తునట్లు ఎంపీడీవో, మండల పంచాయతీ అధికారి కి తమ విధులను తాత్కాలికంగా బహిష్కరిస్తున్నట్లు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతాలు రాక నానా రకాలుగా ఇబ్బందులు పడుతూన్నామని తమకు సహకరించాలని కోరారు. ఇల్లంతకుంట మండల ఈ పంచాయతీ ఆపరేటర్లు ధనుజ్ కుమార్, రమేష్, నరేష్, చంద్రశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు



## అనంతారంలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం..

- పేదోళ్లకు భరోసా గా నిలుస్తున్న ఉపాధి పథకం
- అనంతారం సర్పంచ్ ఒల్లాల రజిత, ఉప సర్పంచ్ జయంత్

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్, ఉప సర్పంచ్ కదం జయంత్ లు గ్రామ వార్డ్ సభ్యులు గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు పేదవారికి చేదోడు వాదోడు నిలుస్తుందని ప్రజలు ఇట్టి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఉపాధి కూలీలకు సంభందించిన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిందిగా వారు అధికారులకు సూచించారు. గ్రామంలోని చొప్పరి వారి గుండ్ల వద్ద పనులు మొదలైనట్లు వారు తెలిపారు. పనుల్లో ఎలాంటి అసౌకర్యాలు కలిగిన, ఏమైనా అవకతవకలు జరిగిన ఉపేక్షించే పరిస్థితి లేదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, వార్డ్ సభ్యులు మల్యాల రాజశేఖర్, చొప్పరి సాయిలు, పీటర్,అక్కేమ్ ఉపేందర్, రమేష్, గోనెపల్లి లావణ్య వెంకటేష్ గ్రామ ప్రజలు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్‌భాస్కర్

**బలగం టీవీ, హనుమకొండ**

ఈనెల 12న నిర్వహించనున్న కార్మికుల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని అశోకా కన్వెన్షన్ హాల్‌లో కార్మిక సంఘాల ఉమ్మడి సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికులు, ఉద్యోగుల హక్కులను కాలరాస్తోందని తీవ్రంగా విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులపై పనిభారం పెంచి, వేతనాలు తగ్గిస్తూ శ్రమ దోపిడీ చేసేందుకు పెట్టుబడిదారుల కుట్రలకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని ఆయన ఆరోపించారు. ఈ దోపిడీ విధానాలకే నిదర్శనంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని పేర్కొన్నారు.రైతుల ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు కూడా తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. సంఘటిత, అసంఘటిత కార్మిక సంఘాలన్నీ కలసి ఈనెల 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి..

- **ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జోనల్ ఆఫీసర్స్, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ మాట్లాడుతూ.. ఎన్నికల నియమ, నిబంధనల స్పష్టమైన అవ గాహన ఉండాలని, ఎస్ఈసీ కరదీపిక వెంట ఉండాలని,ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని అన్నారు. వేములవాడ మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రోజున అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని సూచించారు. ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకువెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, బ్యాలెట్ బాక్స్ లు చెక్ చేసుకొని తీసుకువెళ్లాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం వద్ద 100 మీటర్ల పరిధి వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని అన్నారు.

గుర్తింపు కార్డు ఉన్న పోలింగ్ ఏజెంట్స్, ఎన్నికల అధికారులు మినహా ఎవరికీ అనుమతి లేదని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత సామగ్రి అంతా వేములవాడలోని సినారె కళామందిర్ లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి అప్పగించాలని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ నెల 7, 8 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి కనీస వసతులు, భోజనం ఇతర సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.శిక్షణ కార్యక్రమంలో ఆర్డీఓ రాధాబాయి, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ సిరిసిల్లలో పోలీసుల నిఘా:

- **భారీగా మద్యం పట్టివేత...**
- **బెల్ట్ షాప్ పై దాడి 31,482/-. విలువ గల 28.62 లీటర్ల మద్యం పట్టుకొన్న సిరిసిల్ల టౌన్ పోలీసులు**



**బలగం టీవీ, సిరిసిల్ల:**
జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల సందడి నెలకొన్న వేళ పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని గణేష్ నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుపై సిరిసిల్ల పట్టణ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ ఇన్‌స్పెక్టర్ కే.కృష్ణ తన సిబ్బందితో కలిసి ఆసరి ముత్యం (58) అనే వ్యక్తి నివాసంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో సుమారు 31,482 రూపాయల విలువైన 28.62 లీటర్ల మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ముత్యంను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు లేదా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు..

# స్వేచ్ఛగా ఓటింగ్‌లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం..



- **ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ అన్నారు. మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు ముందురోజు, పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాన్ని నిశితంగా పరిశీలించాలని, ఎన్నికలు జరిగిన తీరును పర్యవేక్షించి, అట్టి నివేదికను ఎన్నికల సాధారణ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని పోలింగ్ సరళినీ, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని, వారి విధులను పటిష్టంగా నిర్వహిస్తునే పోలింగ్ టీంలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతోందా లేదా, ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఎన్నికల నియమావళి అమలు, తదితర విషయాలను సూక్ష్మంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే సాధారణ పరిశీలకుల దృష్టికి వెంటనే తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి మల్లిఖార్జున రావు, ట్రైనర్ మహేందర్ రెడ్డి, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మారథాన్‌లలో మెరిసిన కానిస్టేబుల్ బండ అనిల్‌కు ఎస్పీ అభినందనలు..

**బలగం టీవీ, బోయినపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బండ అనిల్ ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న మారథాన్ ఈవెంట్లలో పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఆయనను జిల్లా ఎస్పీ బి. మహేష్ గితే (ఐపీఎస్) అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ గితే మాట్లాడుతూ.. భవిష్యత్తులో కూడా ఇటువంటి పోటీలలో ప్రావీణ్యం సంపాదించి రాష్ట్ర, దేశ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కానిస్టేబుల్ బండ అనిల్ మాట్లాడుతూ, ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచిం చారు. వయస్సుతో సంబంధం లేకుండా జాగింగ్, రన్నింగ్ వంటి వ్యాయామాలు చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా యువత మాదకద్ర వ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఇటీవల ముంబైలో జరిగిన మారథాన్‌లో 42.2 కిలోమీటర్ల దూరాన్ని 3 గంటలు 26 నిమిషాల్లో పూర్తి చేశారు. రాజస్థాన్‌లోని ఇండియా బోర్డర్ ప్రాంతంలో అత్యంత చలిలో నిర్వహించిన మారథాన్‌లో 100 కిలోమీటర్ల దూరాన్ని 14 గంటల్లో పూర్తి చేశారు. అలాగే కోల్‌కతాలో జరిగిన మారథాన్‌లో 25 కిలోమీటర్లను 1 గంట 56 నిమిషాల్లో, ఢిల్లీలో జరిగిన మారథాన్‌లో 21 కిలోమీటర్లను 1 గంట 38 నిమిషాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు.

## భారతీయ ఉపాధ్యాయురాలిని అత్యుత్తమ పురస్కారంతో సత్కరించిన దుబాయ్ క్రౌన్ ప్రిన్స్...

**బలగం టీవీ, దుబాయ్:**



అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన భారతీయ విద్యావేత్త, కళాకారిణి మరియు సామాజిక నూతనతావాది రౌబుల్ నాగీకి ప్రతిష్ఠాత్మకమైన యూఎస్ డాలర్లు 10 లక్షల (ఖూ వి1 మిలియన్) విలువైన జెమ్స్ ఎడ్యుకేషన్ గ్లోబల్ టీచర్ ప్రైజ్ లభించింది. దుబాయ్‌లో నిర్వహించిన వరల్డ్ గవర్నమెంట్ సమిట్ వేదికపై దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఈ అవార్డును అందజేశారు. ఈ ఏడాది 139 దేశాల నుంచి వచ్చిన 5,000కుపైగా నామినేషన్లు మరియు దరఖాస్తులలో నుంచి రౌబుల్ నాగీని విజేతగా ఎంపిక చేశారు. సమిట్ చివరి రోజున ఈ ప్రకటన చేయగా, జెమ్స్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు సన్నీ వర్కీ మరియు వర్కీ ఫౌండేషన్ ప్రతినిధుల సమక్షంలో అవార్డును అందజేశారు. ఇరవై ఆరు సంవత్సరాల క్రితం, తన ఆర్ట్ వర్క్‌షాప్‌లలో ఒకదానిలో ఇండియన్ టీచర్ రూబుల్ నాగి తన జీవితాన్ని పూర్తిగా మార్చిన ఒక చిన్నారిను కలిశారు. “అతను ఇంతకు ముందు ఎప్పుడూ పెన్సిల్‌ను కూడా చూడలేదు,” అని ఆమె ప్రపంచ ప్రభుత్వ సమ్మిట్ 2026 సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు విద్య, సృజనాత్మకత మరియు ఆత్మవిశ్వాసం అందించేందుకు ఆమె చేసిన కృషి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. వేలాది మంది అభ్యర్థులలోంచి ఎంపికైన రూబుల్ నాగి, కళను సాధనంగా ఉపయోగించి పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే తన సంకల్పాన్ని మరింత బలపరిచారు. ఈ అవార్డు ఆమె చేసిన సేవలకు మాత్రమే కాకుండా, విద్య ద్వారా సమాజాన్ని మారుస్తామనే నమ్మకానికి కూడా గౌరవంగా నిలిచింది.



## పరిశోధనలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటన..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నిర్వహించే జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ రాష్ట స్థాయి పోటీలలో భాగంగా “ఎక్స్ప్లోరింగ్ లింక్ బిట్వీన్ మహాలక్ష్మి స్కీం అండ్ ఉమెన్స్ స్పిరిచువల్ టూరిజం.. ఎ స్టడీ ఆఫ్ వేములవాడ టెంపుల్” అనే అంశంపై ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారం విద్యార్థులు పరిశోధన చేపట్టారు. అందులో భాగంగా ఈరోజు ప్రాజెక్టు సూపర్వైజర్ డాక్టర్ అప్పని ప్రసాద్ ఆధ్వర్యంలో వేములవాడ టెంపుల్ కు వచ్చిన మహిళా భక్తులను మరియు వేములవాడ టెంపుల్ సమీపంలోని వ్యాపారులను వివిధ ప్రశ్నలు అడిగి సమాచారం సేకరించారు. విద్యార్థులు ఈ సేకరించిన సమాచారాన్ని ఆధారంగా మహాలక్ష్మి స్కీం మరియు మహిళల యొక్క ఆధ్యాత్మిక పర్యటనలకు మధ్య గల సంబంధాన్ని మరియు ప్రభావమును పరిశోధణాత్మకంగా విశ్లేషించి పలితాలను రాష్ట స్థాయి పోటీల పంపించడం జరుగుతుందని ప్రాజెక్టు సూపర్వైజర్ డాక్టర్ అప్పని ప్రసాద్ తెలియజేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ప్రచారం రద్దు

**బలగం టీవీ, అమరావతి**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టాల్సిన ఎన్నికల ప్రచారం రద్దయింది. నేడు, రేపు తెలంగాణలో పవన్ కల్యాణ్ ప్రచారం చేయనున్నట్లు గతంలో ప్రకటించగా, తాజాగా ఆ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జనసేన పార్టీ అధికారికంగా వెల్లడించింది.ఏపీలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, పవన్ కల్యాణ్ వ్యక్తిగత కారణాల నేపథ్యంలోనే ప్రచారాన్ని రద్దు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో తెలంగాణలో జనసేన శ్రేణుల్లో కొంత నిరాశ వ్యక్తమవుతోంది.మరోవైపు, మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన నేతలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు.

# స్వదేశంలో ఒత్తిడితో పాటు ప్రోత్సాహం

- **హోం వరల్డ్‌కప్‌లో ప్రతి మ్యాచ్ కీలకం -- కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్**

**బలగం టీవీ, ముంబై**



టీ20 ప్రపంచకప్--2026లో భాగంగా భారత్–అమెరికా మధ్య జరిగే తొలి మ్యాచ్‌కు ముందు భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ప్రపంచకప్‌కు నాయకత్వం వహించడం పట్ల ఆనందంగా ఉందన్న సూర్యకుమార్, కెప్టెన్ కంటే 'లీడర్' అనే పదమే తనకు ఇష్టమని అన్నారు. స్వదేశంలో, వాంఖడే వేదికగా టోర్నీ ప్రారంభించడం ప్రత్యేక అనుభూతిని కలిగిస్తోందని చెప్పారు.

**ఇషాన్ కిషన్ కీలక పాత్ర**

ఇషాన్ కిషన్ ఇటీవల టీ20ల్లో అద్భుతంగా రాణిస్తున్నాడని ప్రశంసించిన సూర్య, అతడు ఎక్కడ బ్యాటింగ్ చేసినా ప్రభావవంతంగా ఆడతాడని అన్నారు. టాప్ ఆర్డర్‌లో కీలక పాత్ర పోషిస్తాడని, మూడో స్థానం కంటే దిగువకు అతడిని పంపే అవకాశమే లేదని స్పష్టం చేశారు.

ప్రపంచకప్‌లో బలహీన జట్లు అన్న భావన లేదని, ఈ ఫార్మాట్‌లో ఏ జట్టైనా ఆశ్చర్యపరచగలదని సూర్యకుమార్ అభిప్రాయపడ్డారు. రెండు మంచి బ్యాటింగ్ లేదా బౌలింగ్ ప్రదర్శనలు మ్యాచ్‌ను తలకిందులు చేయగలవని పేర్కొన్నారు. అందుకే ప్రతి మ్యాచ్‌ను అత్యంత గంభీరంగా తీసుకుంటామని చెప్పారు. గత 19 నెలల్లో భారత జట్టు అద్భుత ప్రదర్శన కారణంగా అంచనాలు పెరిగాయని అంగీకరించిన సూర్య, స్వదేశంలో ఆడటం వల్ల ఒత్తిడితో పాటు ప్రోత్సాహం కూడా ఉంటుందని అన్నారు. అభిమానులకు వినోదం అందించడమే లక్ష్యమని, ఆటను ఆస్వాదించాలనే సందేశాన్ని ఆటగాళ్లకు ఇచ్చినట్లు తెలిపారు. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ లాంటి ప్రపంచస్థాయి స్పిన్నర్లు జట్టులో ఉండటం అదృష్టమని పేర్కొన్నారు. అయితే ప్రత్యర్థి జట్టు, పిచ్ పరిస్థితులను బట్టి తుది కాంబినేషన్ నిర్ణయిస్తామని తెలిపారు. ఇది మేనేజ్‌మెంట్‌కు 'మంచి తలనొప్పి' అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. న్యూజిలాండ్‌పై సిరీస్ విజయం, వార్మప్ మ్యాచ్‌లతో జట్టులో ఆత్మవిశ్వాసం పెరిగిందని, డ్రెస్సింగ్ రూంలో సానుకూల వాతావరణం ఉందని సూర్యకుమార్ వెల్లడించారు. స్వదేశంలో భారత్ తరఫున ఆడే అవకాశం ప్రతి ఒక్కరికీ గర్వకా రణమని చెప్పారు. 'గత కొన్ని మ్యాచ్‌ల్లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. దేశవాళీ క్రికెట్‌లోనూ సత్తా చాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ దూకుడుగా ఆడి తన జట్టును విజేతగా నిలబెట్టాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. వార్మప్ మ్యాచ్‌లో మాత్రం ఓపెనర్‌గా వచ్చాడు. అతను ఏ స్థానంలో బ్యాటింగ్ చేసినా అదే దూకుడు కొనసాగించాలని కోరుకుంటున్నాను. అయితే ఫస్ట్ డౌన్ కంటే దిగువ స్థానంలోఅయితే బ్యాటింగ్ చేయడు. ఏ స్థానంలో ఆడించినా.. తన జోరు కొనసాగిస్తాడని ఆశిస్తున్నా.'అని సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు.

# అండర్-19 ప్రపంచకప్ విజేత భారత్

## ఇంగ్లండ్‌పై 100 పరుగుల ఘన విజయం -- ఆరో టైటిల్‌తో చరిత్ర

- **ఫైనల్‌లో సునామీ సృష్టించిన వైభవ్ సూర్యవంశీ**
- **80 బంతుల్లో 175 పరుగులు చేసిన చిచ్చర పిడుగు**
- **సెంచరీతో పోరాడిన ఇంగ్లండ్ బ్యాటర్ ఫాల్కోనర్**



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత అండర్--19 క్రికెట్ జట్టు మరోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. 2026 అండర్--19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌ను 100 పరుగుల తేడాతో ఓడించి ఆరోసారి ప్రపంచ విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన భారత్ ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం చెలాయించింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర శతకంతో మ్యాచ్‌ను ఒక్కదెబ్బతో మలిచాడు. అతడు 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్స్‌లతో 175 పరుగులు చేసి అభిమానులను ఉర్రూతలూగించాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే 53 పరుగులతో హాఫ్ సెంచరీ సాధించగా, అభిజ్ఞాన్ కుండు (40), విహాన్ మల్హోత్రా (30), వేదాంత్ త్రివేది (32), కాన్షిక్ (37 నాటౌట్) దూకుడుగా ఆడారు.ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో మూడు వికెట్లు (3/63) తీయగా, సెబాస్టియన్ మోర్గాన్, అలెక్స్ గ్రీన్ రెండేసి వికెట్లు సాధించారు.

**ఇంగ్లండ్ పోరాటం వృథా**

412 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టు 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. కాలెబ్ ఫాల్కోనర్ 115 పరుగులతో సెంచరీ చేసినా, బెన్ డాకిన్స్ 66 పరుగులతో పోరాడినా ఓటమిని తప్పించలేకపోయారు.భారత బౌలర్లలో అంబ్రిష్ (3/56) మూడు వికెట్లు తీయగా, దీపేష్ దేవంద్రన్ (2/64), కాన్షిక్ చౌహాన్ (2/63) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఖిలాన్ పటేల్, ఆయుష్ మాత్రే తలో వికెట్ సాధించారు.

**ఆరో టైటిల్‌తో రికార్డు**

ఇప్పటివరకు 10 ఫైనల్స్ ఆడిన టీమిండియా 6 సార్లు అండర్--19 ప్రపంచకప్ విజేతగా నిలిచింది. 2000, 2008, 2012, 2018, 2022, 2026 సంవత్సరాల్లో భారత్ టైటిల్ సాధించింది. 2022 తర్వాత మళ్లీ ఇంగ్లండ్‌పైనే విజయం సాధించడం విశేషం.

విధ్వంసకర ప్రదర్శనతో మెరిసిన వైభవ్ సూర్యవంశీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డులు దక్కాయి. అండర్–19 ప్రపంచకప్ విజేత జట్టుకు నగదు బహుమతి లేకపోయినా, యువ ఆటగాళ్ల ప్రతిభను గుర్తించే వేదికగా ఈ టోర్నీకి ఐసీసీ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. విజేత జట్టుకు ఐసీసీ ట్రోఫీని మాత్రమే అందజేస్తారు.

# టీ20 ప్రపంచకప్‌కు వేళాయే..

- **నేటి నుంచి పొట్టి కప్**
- **భారత్, శ్రీలంక సంయుక్తంగా అందిస్తున్న ఆతిథ్యం**
- **రోజుకు మూడు మ్యాచ్‌లు**
- **యూఎస్ఏతో తలపడనున్న భారత్**



**బలగం టీవీ, హైదరాబాద్**

టీ20 క్రికెట్‌లో మరో ప్రపంచకప్ సమరం మొదలుకాబోతోంది. పొట్టి కప్‌లో సత్తా చాటేందుకు 20 జట్లు సిద్ధమయ్యాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్--2026పై ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమణ, భారత్‌తో మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరించడం వంటి పరిణామాల మధ్య ఈ మెగా టోర్నీపై ఉత్కంఠ మరింత పెరిగింది.

శ్రీలంకలోని కొలంబో వేదికగా శనివారం పాకిస్థాన్--నెదర్లాండ్స్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో టోర్నీకి తెరలేవనుంది. రోజుకు మూడు మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. భారత జట్టు శనివారం రాత్రి 7 గంటలకు యూఎస్ఏతో జరిగే మ్యాచ్ తో తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది.

ఫామ్, ట్రాక్ రికార్డ్‌లను పరిశీలిస్తే టీమిండియా ఈ టోర్నీలో హాట్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. గత రెండేళ్లుగా భారత్ ఒక్క టీ20 సిరీస్ కూడా ఓడిపోలేదు. ఇప్పటివరకు టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఆతిథ్య జట్టు టైటిల్ గెలవలేదు. అలాగే ఏ జట్టూ వరుసగా రెండు టైటిళ్లు సాధించలేదు. ఈ చరిత్రను తిరగరాయాలనే లక్ష్యంతో భారత జట్టు ముందుకు సాగుతోంది.

గత ప్రపంచకప్ విజయాన్ని పునరావృతం చేయాలనే పట్టుదలతో 'హిస్టరీ రిపీట్' లక్ష్యంగా, అదే సమయంలో చరిత్రను ఓడించాలనే సంకల్పంతో 'హిస్టరీ డిఫీట్' నినాదంతో భారత్ బరిలోకి దిగుతోంది.

**20 జట్లు -- 4 గ్రూపులు**

ఈ టోర్నీలో పాల్గొనే 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. లీగ్ దశలో ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని ఇతర జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. లీగ్ దశ ముగిసే సరికి ప్రతి గ్రూప్‌లో టాప్--2 జట్లు సూపర్--8కు అర్హత సాధిస్తాయి.

సూపర్--8 దశలో జట్లను రెండు గ్రూపులుగా విభజిస్తారు. అక్కడ కూడా ప్రతి జట్టు ఇతర జట్లతో మ్యాచ్‌లు ఆడుతుంది. సూపర్--8లో టాప్--2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరతాయి. సెమీఫైనల్ విజేతలు ఫైనల్‌లో తలపడతారు.

ఐసీసీ టీ20 ప్రపంచకప్--2026ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్ అధికారికంగా ప్రసారం చేయనున్నాయి. స్టార్ స్పోర్ట్స్‌కు చెందిన అన్ని భాషల చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది. రోజుకు మూడు మ్యాచ్‌లు ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతాయి.

# కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు చేసిందేమీ లేదు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు. హామీల అమలు పరిపాలన వైఫల్యాలతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నది. మరోవైపు కుల మతాల పేరుతో ఓట్లు అడుగుతూ బిజెపి ఎన్నికల అప్పుడు ఓట్లు వేయించుకుంటుంది. అందుకే ఈ రెండు పార్టీలకు మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కి ఓటు వేసి కేసీఆర్ ని మరోసారి సీఎం చేసుకునే ప్రస్థానాన్ని ప్రారంభించాలని, ఆరు గ్యారెంటీలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఆ పార్టీని ఓడించండని అన్నారు.

వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల సందర్భంగా బాండ్ పేపర్ మీద రాసి ఇచ్చి ఆరు గ్యారెంటీలు అన్నింటిని వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పిన విషయాన్ని ఆ సందర్భంగా ఆది శ్రీనివాస్ ఇచ్చిన బాండ్ పేపర్ ని ప్రజల ముందు చూపిస్తూ కేటీఆర్ మాట్లాడారు. ఈసారి తనకు ఓటు వేయకుంటే చనిపోతానని నాలుగు సార్లు ఓడిపోయినా అని చెప్పి సానుభూతి డైలాగులతో ఆరోజు ప్రజలను మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్ ఆ తర్వాత హామీల అమలు నుంచి మొదలుకొని అభివృద్ధి వరకు అడ్రస్ లేకుండా పారిపోయాడన్నారు. మరోవైపు కేవలం మంత్రి పదవి కావాలన్న ఉద్దేశంతో రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకుంటున్న ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలి అన్నారు. ఇస్తామన్న ఆరు గ్యారెంటీలలో కనీసం ఒక్కదాన్నైనా అమలు చేశారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ ఇన్ని రకాల మోసాల తర్వాత, ద్రోహాల తర్వాత కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలకు మేము చేస్తున్నదే సరైంది అని... ప్రజలు కాంగ్రెస్ కి అనుకూలంగా తీర్పు ఇస్తున్నారని రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నదని, హామీల అమలు పైన భవిష్యత్తులోనూ దృష్టి పెట్టే అవకాశమే ఉండదని కేటీఆర్ హెచ్చరించారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీలు ముఖ్యంగా నాలుగు వేల పెన్షన్, ఆసరా పెన్షన్ నుంచి మొదలుకొని రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ , తులం బంగారం రావాలన్నా ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని, అప్పుడే తాము చేస్తున్న మోసాల పైన ప్రజలు కోపంగా ఆగ్రహంగా ఉన్నారన్న విషయాన్ని తెలుసుకుంటుంది అన్నారు. మరోవైపు ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా చేసింది ఏమీ లేదని తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ ఎలాంటి లబ్ధి చేయలేదన్నారు. పదిహేను లక్షలు ప్రతి ఇంటికి ఇస్తానని చెప్పిన మోదీ ఆ తర్వాత ఇచ్చిన హామీలన్నింటినీ పక్కన పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రతిసారి ఎన్నికలు రాగానే దేవుడి పేరు చెప్పి కులం, మతం పేరు చెప్పి బీజేపీ ఓట్లు ప్రజలతో వేయించుకుంటుందని కేటీఆర్ విమర్శించారు. ఈసారి కూడా బీజేపీ దొంగ మాటలకు మోసపోవద్దని కేవలం పేదోళ్ల కడుపులు నింపి తండ్రి లెక్క చూసుకొని తెలంగాణ తెచ్చిన వారెవరో గుర్తుంచుకొని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. ఈ ఎన్నికల్లో ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెడితేనే కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటో అర ఆరు గ్యారెంటీలు అమలు పైన దృష్టి సారిస్తుంది అన్నారు.ఈ మున్సిపల్ ఎన్నికల్లో వేసే ఓటుతో మరోసారి కేసీఆర్ ని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునే ప్రస్థానం ప్రారంభం కావాలని కేటీఆర్ అన్నారు. వేములవాడలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో కేటీఆర్ తో పాటు స్థానికంగా మున్సిపాలిటీకి పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# 'వికసిత తెలంగాణ- బీజేపీ సంకల్ప పత్రం' ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తామని తెలిపారు. అలాగే తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, కమ్యూనిటీ హాళ్లు, ట్రాఫిక్ నియంత్రణ, డిజిటల్ సేవలు, విద్య, వైద్య సదుపాయాలను అత్యున్నత ప్రమాణాలకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలపై రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి, ప్రాజెక్టుల కిక్‌బ్యాక్‌లు, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే వారి పాలన లక్షణాలని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలపై పోలీసులను దుర్వినియోగం చేస్తున్నారని, రామగుండం అభ్యర్థిని బెదిరింపులతో ఉపసంహరించుకునేలా చేశారని, మంచిర్యాల జిల్లాలో కార్యకర్తలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు.కర్ణాటకలోని 'హేట్ స్పీచ్ బిల్'ను అనుసరిస్తూ తెలంగాణ కాంగ్రెస్ బీజేపీ నేతలను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించిన ఆయన, ఈ అంశాన్ని మానవ హక్కుల కమిషన్‌తో పాటు కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.